సాక్షి నిర్మల్

ఆదివారం । 25 ఫిబ్రవరి । 2024



భయం వీడితే జయమే..
విద్యా సంవత్సరంచివరి దశ పరీక్షలు అనే సరికి మనసులో ఆందోళన ఉంటుంది. ఒత్తిడికి గురవుతుంటారు. భయం వీడితే విజయం వరిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. 8లో



తలాపునే నీరున్నా..! 9లో
తలాపున నీరున్నా.. వర్షంపైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి భైంసా పట్టణ శివారు రైతులది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి కాలువ తవ్వి నీరందించాలని కోరుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.3 /22.1

వాతావరణం
తుపాను ప్రభావంతో ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉదయం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కోర్టు కార్యాలయంలో వైద్యశిబిరం



జడ్జికి ఆరోగ్య పరీక్షలుచేస్తున్న వైద్యసిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని కోర్టు కార్యాలయంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఈ మేరకు కోర్టు జడ్జి దేవేంద్రబాబుతోపాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జడ్జి దేవేంద్రబాబు ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులు, సిబ్బందిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా విద్యార్థులు



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో జిల్లాస్థాయి పోటీల్లో గెలిచిన పల్లవి, నాగేష్, చందన పాల్గొన్నారు. సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు నారాయణవర్మ, సత్యం, శ్రీనివాస్, నరేంద్రకుమార్ పరీక్షను పర్యవేక్షించారు.

మిడ్‌లెవల్ హెల్త్‌ప్రొవైడర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్టు పద్ధతిలో హెల్త్ వెల్నెస్ సెంటర్లలో పనిచేసేందుకు 15 మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్, (తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్), బీఏఎంఎస్(బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ రిజిస్ట్రేషన్)బీఎస్సీ నర్సింగ్ -2020 అకడమిక్ సంవత్సరం నుంచి పూర్తి చేసి (తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రిజిస్ట్రేషన్)బీఎస్సీ నర్సింగ్‌తోపాటు ఆరు నెలల సీపీసీహెచ్ బ్రిడ్జ్ కోర్స్ ఇగ్నో ద్వారా పూర్తి చేసిన వారు, జీఎన్ఎమ్ కోర్సుతో 6 నెలల సీపీసీఎచ్ బ్రిడ్జ్ కోర్స్ ఇగ్నో ద్వారా పూర్తిన వారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. దరఖాస్తు ఫారాలను nirmal.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని అర్హత పత్రాల జిరాక్సులు జత చేసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మార్చి 2వ తేదీ వరకు సమర్పించాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించాలి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, బదిలీలు ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం మాట్లాడారు. బదిలీలు, ప్రమోషన్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌దాస్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతా రహస్యమే!?

- బాసర ట్రిపుల్ ఐటీలో ఏం జరిగినా బయటకు రాదు..
- లోనికి ఎవరికీ అనుమతి లేదు..
- ఎవరైనా లీక్ చేస్తే క్రమశిక్షణ పేరిట చర్యలు
- సమస్యలపై పోరాడిన విద్యార్థులకూ వేధింపులు
- సీఎం రేవంత్‌పైనే విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశలు
- వర్సిటీకి రావాలని విన్నపం



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు మానసిక ఒత్తిడితో తమ భవితను బలి పెడుతున్నారు. ఉన్నతంగా ఎదగాల్సిన పిల్లలు ఆంక్షలు, నిబంధనలు తట్టుకోలేక అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇక ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థుల్లో చాలా వరకు మొదటి సంవత్సరం విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. అధ్యాపకులు, అధికారుల నుంచి భవిష్యత్‌పై భరోసా లేకనే బలవన్మరణానికి పాల్పడుతున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు వర్సిటీలో అధికారులు అంతా రహస్యం పాటిస్తున్నారు. విద్యార్థుల ఇబ్బందులు కానీ, కష్టాలు కానీ ఎవరికీ చెప్పుకునే పరిస్థితి లేదు. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఏడాది క్రితం వర్సిటీ అధికారులు నిబంధనలు, ఆంక్షలు మరింత కఠినతరం చేశారు. క్యాంపస్‌లో సెల్‌ఫోన్ వాడినా, ఫొటోలు తీసినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో లోపల ఏం జరుగుతుందో ఎవరికీ తెలియడం లేదు.

ఆంక్షలతో విసిగిపోయి..
వర్సిటీలో అధికారుల ఆంక్షలు, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంతో విసిగిపోయిన విద్యార్థులు ఏడాదిన్నర క్రితం ఉద్యమబాట పట్టారు. శాంతి యుత నిరసనలతో రాష్ట్రస్థాయిలో సమస్యలు చర్చనీయాంశంగా మార్చారు. పది రోజుల ఆందోళన తర్వాత అప్పటి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినా.. ఇప్పటికీ అవి నెరవేరలేదు.

అడుగడుగునా ఆంక్షలు..
ఇక బాసర ట్రిపుల్ ఐటీలో అడుగడుగునా ఆంక్షలే. మీడియాకు అనుమతి లేదు. విద్యార్థి సంఘాల నాయకులకు అనుమతి లేదు. తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ప్రతినిధులకు అనుమతి ఇవ్వరు. క్యాంపస్‌లో ఏదైనా ఘటన జరిగితే బయటకు చెప్పేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వర్సిటీ అధికారులు మీడియాకు ఇచ్చే సమాచారం మినహా ఎవరూ ఇతర వివరాలు చెప్పరు. అడిగే ప్రయత్నం చేసిన క్రమశిక్షణ చర్యలకు గురవుతామని నోరు మెదపరు. ఇక క్యాంపస్‌లో విద్యార్థుల సెల్‌ఫోన్ వినియోగంపైనా ఏడాది క్రితం ఆక్షలు విధించారు.

సీఎంపైనే ఆశలు...
తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిపైనే ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు ఆశలు పెట్టుకున్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి 2022, జూలై 17న మహారాష్ట్ర సరిహద్దు నుంచి బాసర ట్రిపుల్‌ఐటీకి చేరుకున్నారు. అప్పట్లో నిబంధనల కామారెడ్డి జిల్లాలోనే రేవంత్‌ను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. హైవేపై నుంచి కాకుండా మారుమూల గ్రామాల నుంచి మహారాష్ట్రకు వెళ్లి ధర్మాబాద్ వైపు నుంచి ట్రాక్టర్ ఎక్కి ట్రిపుల్‌ఐటీకి వచ్చారు. గోడ దూకి విద్యార్థుల దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించారు. క్యాంపస్ గోడ ఎక్కి దూకి లోనికి వెళ్లి విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయనే సీఎం అయినందున ఇక్కడి సమస్యలపై ఆయనకు అవగాహన ఉన్నందున ఒక్కసారి వర్సిటీకి రావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారులతో వచ్చి సమీక్ష నిర్వహించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే పర్యటన..
ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ ఫిబ్రవరి 5న బాసర ట్రిపుల్‌ఐటీకి వెళ్లారు. విద్యార్థులు ఉండే గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశీలించారు. వారితో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. మెస్‌లలో పురుగుల అన్నం పెట్టే పరిస్థితిని మార్చాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. ఫిబ్రవరి 15న ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు. వర్సిటీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, డైరెక్టర్‌కు ఎలాంటి అధికారాల లేకపోవడంతో పాలన కుంటుపడిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 18 నెలలుగా వీసీ పర్యవేక్షణలేదని తెలిపారు. ట్రిపుల్‌ఐటీ ప్రక్షాళన చేయాలని కోరారు. తమ భవిష్యత్‌కు భరోసా కల్పించాలంటే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒక్కసారి క్యాంపస్‌కు రావాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రక్షాళన చేస్తే రాష్ట్రానికే తరమానికంగా మారుతుందని పేర్కొంటున్నారు.

లక్ష్మీనృసింహుడికి జడ్జి పూజలు



జడ్జిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడెం: మండలంలోని అక్కకొండ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఖానాపూర్ కోర్టు మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు ఆలయ అధికారులు జడ్జికి తీర్థప్రసాదాల అందించారు. వేడుకల్లో భాగంగా రాత్రి మహిళలు కొండపై దీపారాధన చేశారు. రథోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అక్కొండకు చేరుకున్నారు.

గిరిజనులను భయపెడుతున్న అటవీ అధికారులు



మాట్లాడుతున్న మంచికంటి లక్ష్మణ్

పెంబి: ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకున్నా అటవీ ప్రాంతం నుంచి రోడ్డు, కరెంట్, తాగు నీటి సౌకర్యం కావాలని కోరినా అధికారులు భయపెడుతున్నారని అఖిల భారత కూలీ సంఘం జిల్లా నాయకుడు మంచికంటి లక్ష్మణ్ ఆరోపించారు. మండలంలోని కోరకంటి, అంకెన, రాయదారి, పోచంపల్లి, గోధుమల్లే, పస్పుల, తదితర గిరిజన గ్రామాలలో ఆదివాసులు చేసుకుంటున్న పోడు భూములను శనివరాం పరిశీలించి మాట్లాడారు. గిరిజనులు అడవిలో పశువులను మేపడానికి వెళ్లినా ఇబ్బంది పెడుతున్నారనన్నారు. పోడు వ్యవసాయం చేసుకోవాడానికి ఒక్కో గిరిజనుడి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెంబి అటవీ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు లక్ష్మణ్, గంగారాం, రైతులు ఉన్నారు.

ఆమెకు.. 'భరోసా'



నిర్మల్‌లో ఇటీవల ప్రారంభించిన భరోసా కేంద్రం

- నిర్మల్‌లో కేంద్రం ఏర్పాటు
- మహిళలు, బాలికల రక్షణే లక్ష్యం

నిర్మల్ టౌన్: చట్టాలు కఠినంగా అమలు చేస్తున్నా.. మహిళలు, యువతులు, బాలిలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో లైంగిక వేధింపులు, దాడులకు గురైనవారికి అండగా నిలిచేందుకు, బాధితులకు భరోసా కల్పించేందుకు అన్ని వసతులతో ఇంటిగ్రేటెడ్ సపోర్ట్ సెంటర్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్(భరోసా) కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పోలీస్ శాఖ నిర్ణయించింది. 2016లో హైదరాబాద్‌లో తొలి భరోసా కేంద్రం ప్రారంభించిది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఈ నెల 18న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, ఎస్పీ జానకి షర్మిల ప్రారంభించారు. ఈ కేంద్రం పోలీస్ శాఖ పర్యవేక్షణలో నడుస్తుంది. బాధిత మహిళలు, బాలికలకు మనోధైర్యంతోపాటు భరోసా కల్పించనుంది. పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందిగా భావించే బాధితులు ఈ కేంద్రాన్ని ఆశ్రయించోవచ్చు. ఆపదలో ఉన్న ఎవరైనా వచ్చి భరోసా కేంద్రం తలుపు తడితే వారికి తక్షణమే ప్రత్యేక సేవలు, సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అవసరాన్ని బట్టి బాధితులకు సఖీ కేంద్రంలో పునరావాసం కూడా కల్పించబడుతుంది.

అవగాహన కార్యక్రమాలు..
అవగాహన కార్యక్రమాల ద్వారా పిల్లలకు అసభ్యకర ప్రవర్తన గురించి తెలియజేయడం, ఎటువంటి దుర్ఘటనలు జరిగినా ఎవరికి, ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన కల్పిస్తారు. ఘటనలు జరిగిపినప్పుడు కలిగే మానసిక ఒత్తుళ్లు, వాటి నుండి బయట పడడానికి మానసిక సంరక్షణ, కౌన్సెలింగ్ అవసరం గురించి కూడా తెలియజేస్తారు. గృహహింస, ఇతర అసభ్యకర ప్రవర్తనల గురించి వివరిస్తారు. ఇటువంటి పరిస్థితిలో ఫిర్యాదు చేయడం, మహిళలు, పిల్లలకు ఉన్న చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తారు.

కేంద్రం లక్ష్యాలు..
ప్రైవేట్, పబ్లిక్ ప్రదేశాల్లో హింసకు గురైన పిల్లలు , ఆడవారికి సమగ్రమైన మద్దతు, సహాయం అందజేయడం. ఆడవారిలో ఎటువంటి హింసాత్మక చర్యలనైనా ఎదురుకునేందుకు అత్యవసర, నాన్- ఎమర్జెన్సీ, వైద్య, చట్టపరమైన, మానసిక , కౌన్సెలింగ్ మద్దతు అందించడం. మగవారికి, ఆడవారికి మధ్య సమానభావాన్ని తీసుకురావడంతో సమతుల్యతతో కూడిన సమాజ నిర్మాణం. కుటుంబాల్లో, సమాజంలో ఉన్న సమస్యలు పరిష్కరించడం ద్వారా ఆడవారికి, పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని ఏర్పరచడం.

బాధితులకు అండగా..



బాధితులకు భరోసా కేంద్రం అండగా ఉంటుంది. వేధింపులు, అత్యాచార బాధిత మహిళలకు, పిల్లలకు ఒకేచోట మెడికల్, న్యాయ సలహా, వైద్యం, కౌన్సెలింగ్, సైకాలజికల్ సమస్యలకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పిస్తాం. బాధిత మహిళలు, యువతులు, బాలికలు అన్యాయానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. స్కూళ్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పిల్లలకు బ్యాడ్ టచ్ , గుడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తాం. మహిళలు, పిల్లల సమస్యలను తక్షణమే పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తాం.
– డాక్టర్ జానకి షర్మిల, ఎస్పీ

సేవలు ఇలా..
భరోసా కేంద్రంలో ఒక మహిళా ఇన్‌స్పెక్టర్, సైకాలజిస్టు, సపోర్టు పర్సన్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, న్యాయవాది, రిసెప్షనిస్టు ఉంటారు. బాధితులకు భరోసా కల్పించే కేంద్రాలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వీటికి ఈ పేరు పెట్టింది. లైంగిక దాడులు, ఇతర వేధింపులకు గురైన పిల్లలు, మహిళల మానసిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని భరోసా కేంద్రాల్లో సేవల నిర్వహణ తీరు ఉంటుంది. ఇక్కడ పోలీసు స్టేషన్ తరహా వాతావరణం ఉండదు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చి, అవసరాన్ని బట్టి కేసు నమోదు చేస్తారు. బాధితులకు భరోసా కలిగించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. వారిలో మనోధైర్యం కల్పించేందుకు సైకాలజిస్టు ఉంటారు. బాధితులకు అన్నిరకాలుగా ధైర్యం చెప్పేలా మరో సపోర్టింగ్ పర్సన్ సేవలు అందిస్తారు. బాధితుల గురించి ఇతరులకు తెలియకుండా వారు మానసికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉంటాయి. వైద్య సేవలు, పరీక్షల నిర్వహిస్తారు. వేగంగా న్యాయ సేవలు అందించేలా భరోసా కేంద్రంలో న్యాయవాది అందుబాటులో ఉంటారు. బాధితులు కోరిన ప్రకారం వారికి న్యాయ సేవలు అందిస్తారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 23 కేంద్రాల్లో 13,345 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 02 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగుతాయని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలో 47 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగతాయని తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల విద్యార్థుల కోసం ఆయా రూట్లలో బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాతనే బయటకు పంపాలని తెలిపారు. పటిష్ట బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలను సంబంధిత కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. పరీక్ష సమయాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో గంగయ్య, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఐఈవో పరశురాం, చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

- ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం

నిర్మల్‌చైన్‌గేట్: మార్చి 3న దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్స్ పోలియోపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. జిల్లాలో 5 ఏళ్లలోపు పిల్లలు 86,290 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టణ పరిధిలో 88, గ్రామీణ ప్రాంతాల్లో 543 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో టాం టాం వేయించాలని సూచించారు. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పట్టణ ముఖ్య కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్వాడీ, మహిళా సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొనాలన్నారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాలలోని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 4, 5 తేదీలలో ఇంటింటి సర్వే నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన సీనియర్ సర్వెలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్ పల్స్‌పోలియో వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో గంగయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

బీసీ సాయం అందేనా?

- జిల్లాలో ఆర్థిక సాయం కోసం 14,521 దరఖాస్తులు
- 11,490 మందిని ఎంపిక చేసిన గత ప్రభుత్వం
- మొదటి విడతలో 900 మందికి రూ.లక్ష సాయం
- తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ కులవృత్తుల వారిని ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించింది. దీంతో జిల్లాలోని అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. కొందరికి ఆర్థికసాయం కూడా అందింది. అయితే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీసీ బంధు పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. త్వరలోనే సమీక్ష చేసి అమలు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం ఈ పథకం కొనసాగింపుపై క్లారిటీ ఇవ్వకపోవడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకం కింద నియోజకవర్గానికి 300 మంది చొప్పున మొత్తం 900 మందికి రూ.లక్ష చొప్పున సాయం అందింది. రెండో విడతలో నియోజకవర్గానికి 200 మంది చొప్పున బీసీ వెల్ఫేర్ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. కొత్త ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తేగాని ఆర్థిక సహాయం అందే అవకాశం లేదు.

14 వేలకుపైగా దరఖాస్తులు..
ఈ పథకం కింద రుణాలు అందించేందుకు 14 బీసీ కులవృత్తిదారుల నుంచి గత ప్రభుత్వం దరఖాస్తులు కోరింది. నాయీబ్రాహ్మణ, ఉప్పరి, విశ్వబ్రాహ్మణ, రజక, కుమ్మరి, కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, పూసల, మేదర, వడ్డెర, ఆరెకటికలతోపాటు ఎంబీసీ కులాల వారు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 14,521 దరఖాస్తులు రాగా క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు విచారణ చేసి మొత్తం 11,490 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. ఇందులో మొదటి విడతలో 900 మందికి రూ.లక్ష సహాయం అందించారు. ప్రభుత్వం మారడంతో మిగిలిన 10,590 మంది దరఖాస్తుదారులకు ఆర్థికసాయం అందుతుందా లేదా..? అనే అనుమానం నెలకొంది.

2016 నుంచి అందని రుణాలు...
2016 నుంచి జిల్లాలో బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వలేదు. ఎన్నికల ముందు తీసుకొచ్చిన బీసీ కుల వృత్తిదారుల పథకంతో కొంతైనా లబ్ధి పొందుతామని అనుకున్నవారికి ప్రభుత్వం మారడం నిరాశను కలిగిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 6 వేల కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇస్తే తమకు కొంతైనా మేలు జరుగుతుందని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పథకం కొనసాగేనా...
గత ప్రభుత్వం అమలు చేసిన ఈ సాయం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందా? మళ్లీ కొత్తగా ఏమైనా పథకం రూపొందిస్తుందా? అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.



ఆదేశాలు రాలేదు..
బీసీబంధు కొనసాగింపుపై ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల మేరకు బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర అధికార యంత్రాంగం సూచనలకు అనుగుణంగా విధివిధానాలు రూపొందిస్తాం.
– రాజేశ్వర్‌గౌడ్, బీసీ సంక్షేమ అధికారి

ఆర్థికసాయం దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తు చేసిన తర్వాత ఎంక్వైరీ పూర్తయి అర్హులుగా ఎంపికైనా సాయం రాకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు.

కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటుపై హర్షం

- టీఎస్‌సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

నిర్మల్‌ఖిల్లా: గత ప్రభుత్వం తెచ్చిన 317 జీవో తో స్థానికత కోల్పోయి వందల కిలోమీటర్ల దూరంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రమంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(టీఎస్‌సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు. 317 జీవోతో మూడేళ్లుగా వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇతర జిల్లాలో పనిచేస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉద్యోగులు పదవీ విరమణ వరకు స్థానికేతర జిల్లాలోనే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. బాధితుల ఆ వేదనను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 317 సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు, పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్టీయూ..
నిర్మల్ రూరల్: జీవో 317 పరిష్కారం కోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుపై పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓడ్నల రవిరాజ్, సిరికొండ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించడాన్ని స్వాగతించారు. త్వరగా 317 జీవో సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

క్లుప్తంగా

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఆడిట్ బృందం

బజార్‌హత్నూర్: హైదరాబాద్‌కు చెందిన సామాజిక, ఆర్థిక అధ్యయన కేంద్రం బృందం శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సమగ్ర శిక్ష సామాజిక పరిశీలన చేపట్టారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రశేఖర్, రీసెర్చ్ సూపర్‌వైజర్ రేణుకతో కలిసి పాఠశాలలో అమలవుతున్న సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాలను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు, సమగ్ర శిక్ష అభియాన్ అమలు తీరుపై ఆరా తీశారు. జిల్లాలో ఎంపికైన పాఠశాలలను తనిఖీ చేసి సంబంధిత వివరాలను డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



కలపను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

సిరికొండ: మండలంలోని వాయిపేట్ అటవీ నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు గస్తీ నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున వాయిపేట్ నుంచి కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు వెంబడించగా తప్పించుకున్నారు. అయితే మండల కేంద్రం శివారులో ఆరు టేకు దుంగలను పడేసి వెళ్లిపోయారు. వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి గిరయ్య తెలిపారు. అనంతరం విచారణ చేయగా ట్రాక్టర్ భీంపూర్ గ్రామానికి చెందిన రాముకు చెందినదిగా తేల్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ గస్తీలో ఎఫ్‌బీవో సందీప్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి లారీలు పట్టివేత

ఇచ్చోడ: అక్రమంగా మిర్చి తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా మిర్చిలోడ్‌తో ఉన్న రెండు లారీలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో లారీలను జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆంధ్ర నుంచి నాగ్‌పూర్‌కు వెళ్తున్న లారీలకు ఎలాంటి ధ్రువ పత్రాలు లేకపోవడంతో వారికి అప్పగించినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి నుంచి ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు టూ టౌన్ ఎస్సై జీవీ రమణ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన విలాస్ తల్లి అనారోగ్యంతో బాధపడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను చూడడానికి విలాస్ ఈ నెల 21న ఆసుపత్రి ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఆసుపత్రిలోకి వెళ్లాడు. గంట అనంతరం చూసేసరికి బైక్ కనిపించక పోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భయం వీడితే జయమే..

- పరీక్షల వేళ ఒత్తిడిని దరిచేరనివ్వద్దు
- ప్రశాంతతతోనే మంచి ఫలితం
- ఒత్తిడిని జయిస్తేనే విజయమంటున్న నిపుణులు
- మరో మూడురోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం



విద్యార్థుల సన్నద్ధతను పర్యవేక్షిస్తున్న డీఐఈవో పరశురాం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: విద్యా సంవత్సరం మొత్తం చదువులు, ప్రత్యేక తరగతులు, రివిజన్, సెమి ఫైనల్ పరీక్షలు, ప్రయోగపరీక్షలు.. అన్ని దాటుకుంటూ తుది పరీక్షల వరకు వచ్చేశారు ఇంటర్ విద్యార్థులు. చివరి దశ పరీక్షలు అనే సరికి మనసులో ఆందోళన ఉంటుంది. తక్కువ మార్కులు వస్తే, ఫెయిల్ అయితే ఎలా అనే ఆందోళనతో ఒత్తిడికి గురవుతుంటారు. పరీక్షలు జీవితంలో భాగం మాత్రమేనని ఎంతో భవిష్యత్ ముందుంటుందని విద్యావేత్తలు మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రశాంతంగా చదివితే సరిపోతుందని, ఫలితం ఏ విధంగా వచ్చిన స్వీకరించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. గతేడాది రాష్ట్రస్థాయి మార్కులతో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులు పలు సూచనలిస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ఈ ఐదు రోజులు ఇలా చేయాలి...

- విద్యార్థులు తెల్లవారుజామున 5గంటలకు లేచి రివిజన్ చేయాలి. ఉదయం పూట చదవడంతో పాఠ్యాంశాలు తొందరగా మదిలోకి ఎక్కుతాయి. ఎక్కువ కాలం పాటు జ్ఞాపకం ఉంటాయి.
- రోజువారి సమయం ప్రకారం సబ్జెక్టుల వారీగా సమయాన్ని విభజించుకోవాలి..
- పరీక్షలకు మధ్యలో సెలవులు వచ్చిన వాటికంటే వరుసగా ఉన్న పరీక్షల పాఠ్యాంశాలను ఎక్కువ సమయం పాటు రివిజన్ చేయాలి.
- కఠినమైన అంశాలను రాస్తూ అధ్యయనం చేయాలి. బట్టి పట్టకుండా సబ్జెక్టును సమగ్రంగా ఆకలింపు చేసుకోవాలి.
- చదివిన అంశాన్ని చూడకుండా కాగితం పై రాస్తూ సాధన చేయాలి..
- పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్లు టీవీలు వంటి వాటికి దూరంగా ఉండడం మంచిది.

తల్లిదండ్రుల బాధ్యత ఏమిటి..?

తల్లిదండ్రులు ఇంటర్ చదువుతున్న తమ పిల్లల్ని మార్కుల విషయంలో ఒత్తిడికి గురిచేయకుండా ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాలి. పరీక్షలు పూర్తయ్యే వరకూ ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండేలా ఇంట్లో వాతావరణాన్ని సృష్టించాలి. వారిని కోపగించుకోకుండా సరైన సాత్విక ఆహారం అందిస్తూ ఇన్ని రోజులు చదివిన పాఠ్యాంశాలను రివిజన్ చేయమని సూచించాలి. పాఠ్యాంశ విషయాలను నిపుణులైన అధ్యాపకుల చేత సందేహ నివృత్తి చేసేలా సదుపాయం కల్పించాలి.

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు..

జిల్లా	కాలేజీలు	విద్యార్థులు
నిర్మల్	63	13,345
మంచిర్యాల	66	15,529
ఆదిలాబాద్	77	21,527
కుమురంభీం	48	10,423

ప్రశాంతంగా చదివితే ఫలితం..



ఇంటర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఒత్తి డికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో ఉండా లి. పరీక్షలు ప్రారంభమయ్యాక పరీక్షకు సంబంధించిన పాఠ్యాంశాలను మాత్రమే చదవాలి. పూర్తయిన పరీక్షల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. – జాదవ్ పరశురాం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, నిర్మల్

శ్రమకు తగ్గ విశ్రాంతి అవసరం...



పరీక్షల కాలంలో విద్యార్థులలో సహజంగానే అంతర్గతంగా ఒత్తిడి ఉంటుంది. చదవడానికి శ్రమిస్తున్న వి ద్యార్థులు మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. ని రంతరం విరామం లేకుండా చదవడం కంటే మ ధ్యలో 15 నుండి 20 నిమిషాల పాటు మనసుకు విశ్రాంతినివ్వాలి. అలా ఉంటే మైండ్ కూడా రిఫ్రె ష్ అవుతుంది. దీంతో ఇంకా ఏకాగ్రతతో అదనంగా చదవడానికి అవకాశం ఉంటుంది. సమతుల ఆహారం, సరైన మోతాదులో నీరు తీసుకోవాలి.
– డాక్టర్ అల్లాడి సురేష్, ఎండీ, సైకియాట్రిస్ట్, మానసిక వైద్య నిపుణులు, నిర్మల్

ఒత్తిడికి గురికావొద్దు...



పరీక్షలు రాసే విద్యార్థులకు ఒత్తిడితో కూడిన ఆందోళనకు గురవుతారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి ప్రయత్నించాలి. పరీక్షలకు ముందు రోజు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపాలి. కొత్త పాఠ్యాంశాల జోలికి వెళ్లకుండా రిపీట్ చేయాల్సిన అంశాలనే చూసుకోవాలి. నేను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివి 2023 ఇంటర్ ఫలితాల్లో 987 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాను. – భవానీ హాసిని, గతేడాది రాష్ట్రస్థాయి 3వ ర్యాంకర్, నిర్మల్

సానుకూలవైఖరే ఆయుధం...



నేను గత ఏడాది బైపీసీలో 987 మార్కులు సాధించాను. ఖచ్చితంగా మంచి ఫలితాన్ని సాధిస్తాననే వైఖరితో పరీక్షలను ఎదుర్కోవాలి. పరీక్ష రోజు ఆందోళన చెందకుండా పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. వచ్చిన ప్రశ్నలకు సమాధానాలను రాస్తూ వెళ్లాలి. రాని సమాధానాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తరగతి గదిలో విన్న అంశాలను ప్రశాంతచిత్తంతో ఆలోచిస్తే అవే గుర్తుకు వస్తాయి. – జి.వినాయక్, నిర్మల్

ఆత్మవిశ్వాసంతో పరీక్షల్ని ఎదుర్కోవాలి..



నేను నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశాను. గతేడాది రాసిన పరీక్షల్లో 986 మార్కులతో రాష్ట్రస్థాయి స్థానం లభించింది. అన్ని పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి. పరీక్షల రోజుల్లో ఎంత చదివాం అన్న దానికంటే ప్రశ్న పత్రంలోని సమాధానాలను ఎంత విజయవంతంగా ప్రజెంట్ చేశామన్నదానిపైనే మన మార్కులు ఆధారపడి ఉంటాయి. ప్రశ్నపత్రంలోని సమాధానాలను నిర్ణీత సమయంలో రాస్తే సరిపోతుంది. – డీ. శ్రీజ, ఎంపీసీలో 986మార్కులు..

ముజ్జిగి మల్లన్న ఆలయ ఆవరణలో బోనాలతో భక్తులు



ఘనంగా ముజ్గి మల్లన్న జాతర



ముజ్జిగి మల్లన్న ఉత్సవ మూర్తులు



నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గి మల్లన్న జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంతో పాటు నిర్మల్, చిట్యాల, సోన్, కర్తాల్ ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు సల్లకుండలతో ఆలయానికి నడిచి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, నాయకులు అయ్యగారు భూమయ్య దర్శించుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.



శివసత్తుల పూనకాలతో..

మల్లన్న దేవుని ఆలయాల్లో భక్తుల పూజలు

- ఎల్విలో మల్లయోదులకు కుస్తీ పోటీలు
- మొక్కలు తీర్చుకున్న భక్తులు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

తానూరు: మండల కేంద్రంతో పాటు ఎల్వి గ్రామాల్లోని మల్లన్న దేవుడి ఆలయాల్లో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. తానూరులోని మల్లన్న దేవుని ఆలయంలో మల్లన్న కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎల్వి గ్రామంలో భక్తులు ఉదయం పూజలు నిర్వహించి మల్లన్న పల్లకిని గ్రామంలోని ఆయా విధుల గుండా ఊరేగించారు.

మల్లయోధులకు కుస్తీ పోటీలు...

మల్లన్న దేవున్ని ఉత్సవాల సందర్భంగా ఎల్వి గ్రామంలో మల్లయోధులకు గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. స్థానికులతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం పోటీల్లో పాల్గొన్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు బహుమతులు ప్రదానం చేశారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



రాము మృతదేహం

ముధోల్: మండల కేంద్రంలోని కాల్వగల్లీ వాసి హంగిరిరోళ్ల రాములు(38) అప్పుల బాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వివరాల ప్రకారం... రాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. ఇటీవల వేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకి వెళ్లి వ్యవసాయ చేను వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాములు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపాడు.

కుటుంబ కలహాలతో...



దేవన్న(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన దేవన్న(55) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... దేవన్న ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ కలహాలతో ఇంటికి తి రిగి రాలేదు. శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకు ని ఆత్మహత్య చేసుకున్నాడు. పంట పొలాలకు వెళ్లిన వారు గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చా రు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహా న్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అభిలాశ్(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన అభిలాశ్ (36) మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి భైంసా పట్టణానికి చెందిన అభిలాశ్, ఆనంద్‌లు నిర్మల్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై భైంసాకు వస్తున్నారు. వానల్‌పాడ్ గ్రామ సమీపంలో వంతెనకు ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అభిలాశ్ మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

దుబాయిలో రోడ్డు ప్రమాదం

- మలక్‌చించోలి యువకుడి మృతి



నవీన్(ఫైల్)

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన అప్పాల నవీన్ (19) దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడురోజుల క్రితం మృతిచెందాడు. బంధువుల వివరాల ప్రకారం.. నవీన్ ఏడునెలల క్రితం దుబాయికి వెళ్లి అక్కడ ఓ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని బస్సులో నివాసానికి బయటు దేరగా ఆ బస్సు ప్రమాదానికి గురైంది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడి మృతివార్త విన్న తల్లిదండ్రులు ఎర్రవ్వ–రాజన్నలు విలపించే తీరు గ్రామస్తులను కలిచివేసింది. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి తమను ఆదుకుంటావనుకున్న ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడడంతో ఆ కుటుంబం వీధిన పడినట్లయింది.

స్వగ్రామానికి గల్ఫ్ మృతదేహం



స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన కొందూరి అరవింద్ (20) మృతదేహం దుబాయి నుంచి శనివారం బోరిగాం గ్రామానికి ప్రత్యేక అంబులెన్స్‌లో చేరుకుంది. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పరికిండ్ల స్వదేశ్ వివరాల ప్రకారం... అరవింద్ ఏడాది క్రితమే దుబాయికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. దుబాయిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలో బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందాడు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి విషయాన్ని స్వదేశ్ పరికిండ్లకు సమాచారం ఇచ్చాడు. దీంతో దుబాయిలో జనగామ వాసి గల్ఫ్ జేఏసీ కోఆర్డినేటర్ యాతం స్వామి చొరవ తీసుకుని మృతదేహాన్ని రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో బోరిగాం గ్రామానికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న కారు



ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

నేరడిగొండ: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద శనివారం చోటుచేసుకుంది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోలంకి సచిన్ తన తల్లి చంద్రకళను బైక్‌పై నేరడిగొండ నుంచి కిష్టాపూర్ గ్రామానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్ద వెనుక నుంచికారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సచిన్‌తో పాటు ఆయన తల్లి చంద్రకళకు తీవ్ర గాయాలయ్యాయి. సచిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హీరాసుక జయంతికి తరలిరావాలి

- ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతల పిలుపు



పూజలు చేస్తున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26న నిర్వహించే గోండి ధర్మగురు హీరాసుక జయంతికి ఆదివాసీ తొమ్మిది తెగలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావ్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ సంఘ భవన స్థలంలో హీరాసుక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో వెలసిన సంస్కృతుల్లో అతి ప్రాచీన సంస్కృతి గోండి సంస్కృతి, గోండి ధర్మమన్నారు. 18 రకాల కృతులు, 16 రకాల వాయిద్యాల పద్ధతులతో సంగీత జ్ఞానం ఇచ్చిన్నటువంటి వారు హీరాసుక అని తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీలతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సమాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కొచడే నారాయణ, నాయకులు సెడ్మకి సుభాష్, కుర్సేంగే యాదవ్ రావ్, గేడం మాధవ్, సిడాం రాం కిషన్, సిడాం పురుషోత్తం, గోడం సునీల్ ఉన్నారు.

బాసరలో మాఘ పౌర్ణమి పూజలు



అమ్మవారి ఆలయంలో భక్తులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజ, కళశస్థాపన, రక్షాబంధనం, మండపారాధనతో హోమ పూజలు నిర్వహిచారు. ఆలయ పూజారులు చండీహోమం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు...

బాసర ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచే భక్తులు బారులుతీరి కనిపించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడి సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని గంగమ్మ తల్లికి పూజలు చేశారు. బాసర ఆలయానికి చేరుకుని చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. కుంకుమార్చనలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుడిహత్నూర్: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి శుక్రవారం రాత్రి రిమ్స్‌లో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కదం నారాయణ (41) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో సొంత ఖర్చులకు ఇంట్లో చెప్పకుండా చాలా చోట్ల అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గత ఆదివారం ఇంట్లోని పురుగుల మందుతాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భార్య ఉర్మిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.